# కవలలు

అక్క చెడ్డ అల్లరిబాజా. కాలేజీలో కుర్రాళ్ళని ఎగాదిగా చూసేది. వాళ్ళు వెర్రెత్తిపోయేవాళ్లు. మా ఇంటిచుట్టూ గబ్బిలాలలాగ చక్కర్లు కొటేవారు మా అక్కన్నా, నేనన్నా కాలేజీకి పెద్ద "గ్లామరు".

మేమందమైన వాళ్ళం కాము. ఎవ్వరి కన్నా తెలివైన వాళ్ళం అంతకన్నా కాము. మేమంతా పెద్ద తరగతి సమాజంలో తిరుగుతాము. ఇంగ్లీషుభాష ఇంగ్లీషు వాళ్ళలాగే మాట్లాడుతాము. మా కుటుంబాల్లో ఆడా మొగా విజ్ఞానవంతులే చెరి సమానులే. మా తాత బ్రహ్మ సమాజకుడు. మా తాతా బామ్మా ఓ వర్ణానికీ ఓ రాష్ట్రానికీ చెందినవాళ్లు కారు. మా నాన్న గజిటెడు ఆఫీసరు. మా అమ్మ ఇంగ్లీషు పత్రికల్లో రచయిత్రి. ఆడవాళ్ళ పేజీ నింపుతుంది. మా కుటుంబాలలో లేని అందాలు కనబడతాయి. అందం స్వాభావికంగా లేకపోయినా డబ్బిచ్చి కొనుక్కుంటాం. సంస్కారము బజార్లో దొరకదు. అందం అన్ని షాపుల్లోనూ దొరుకుతుంది. సహజ మైనదానికన్నా కృత్రిమమైన దానికే "గ్లామరు" జాస్తి. మా కాలేజీలో సన్నంగా, పొడుగ్గా, ఎండునక్క లాంటి అయ్యవారున్నారే ఆయనగారు మేమంటే పడిచచ్చేవాడు. వాడికి ఆడవాళ్ళు చదువుకోవటం ఇష్టం లేదు. క్లాసులో ఆడపిల్లల మీద "సిల్లి" రిమార్కులు చేసేవాడు. విశ్వనాధ సత్యనారాయణగారి ఏకలవ్యుడు. మా నాన్న పెద్దపులి. అంచేత ఆ ఎండునక్క మేమంటే జడుపుతోనే ఉండేవాడు. ఆ మహానుభావుడికి మేమంటే విపరీతమైన మమకారం !

వాణ్ణి అక్క కోతిని ఆడించినట్టు ఆడించి, ఆడించి మా నాన్నతో ఏదో చెప్పేసింది. మా నాన్న చండశాసనుడు, నిర్భయస్తుడు. అక్కా నేనూ ఉండగా, "మేష్టరుగారూ మీరు మా పిల్లలదగ్గర అసభ్యంగా ఉంటున్నారట! ఎంచేత?" అని అడిగాడు. వాడు హడలెత్తిపోయాడు.

"ఎవరు చెప్పేరు? నేనా? అసభ్యమా? అన్యాయం." అంటూ మాట లకి తడుపుకున్నాడు.

"అసభ్యమంటే వేరే ఏమైనా ఉండాలా? మీరు మా ఇంటికి ఎందుకు వస్తున్నట్టు? మా నాన్న కోసమా? మా అమ్మ కోసమా? కాదు కదా? మరి దేనికొస్తున్నట్టు?" అన్నాది అక్క.

"బుద్ధి తక్కువే-ఇంక రానులెండి" అని వెళ్ళిపోయాడు. వాణ్ని లాగ గెంటేసింది.

డాక్టరు పిళ్ళారెడ్డి, ఆయన పెళ్ళాం డాక్టరు ఎమ్మో మా నాన్నకి ప్రాణ స్నేహితులు. పిళ్ళారెడ్డి గారికి దేముడిమీద నమ్మకంలేదు. ఏ నమ్మకాలు లేవు. డాక్టరెమ్మోగారు చేదస్తపు కేథలిక్కు. వాళ్ళిద్దరూ విచిత్రమైన దంపతులు. పిళ్ళారెడ్డిగారు గైనొకాలజిస్టు. పురిటి కేసులన్నీ ఆయనే చూసేవారు. డాక్టరెమ్మోగారు మంచి వైద్యురాలు. రోగనిదానం అద్భుతమైనది. రెడ్డిగారు ఆడ పేషెంట్లనీ ఎమ్మోగారు మగ పేషెంట్లనీ చూసేవారు. ఆడాక్టర్ల కొడుకు రెడ్డి బియ్యే పేసై వచ్చాడు. కాబోయే ఇంజనీరు. చిన్నప్పణ్ణుంచి మేమెరిగినవాడే. ఐతే వయస్సు వచ్చాక ఐదేళ్ళ తరవాత వచ్చాడు. ఈ కొత్త ఇంజనీరుతో అక్క షెర్లు మొద లెట్టింది. వాళ్ళ వాటం చూస్తే చాలాదూరం పోతున్నట్టు కనబడిపోయింది. నాన్న మేమెక్కడికి వెళ్ళినా, ఎవరితో వెళ్ళినా అభ్యంతరం పెట్టకుండా విచ్చలవిడిగా విడిచిపెట్టేవాడు. మా మంచిచెడ్డల బాధ్యత మా నెత్తిమీదే ఉండేది.

అక్క దేవాంతకురాలు. మొగాళ్లు ఆడాళ్ళ దగ్గర వెర్రివాళ్ళు, అక్క రెడ్డిని వెర్రెత్తించేసింది. అక్క నిజంగా బాగుండదు. నేనునయం. మేం బాగుండమని ముందే చెప్పేనుకదా! దానికి వొళ్ళు లేనేలేదు. పెద్ద కళ్లు మాత్రం ఉన్నాయి. నల్లపాపల్లో కదలిక ఉంది అంతే. బియ్యే పేసైంది. అమెరికా అమ్మాయిలాగ వేషానికి లోటులేదు.

ఒకనాడు అక్క ఆకాశపు రంగుచీరా, ఆకాశపురంగు బ్లౌజూసింగా రించింది. చీరచుట్టూ జరీ లతలు ప్రకాశిస్తున్నాయి. తల్లో ఆకాశపు రంగు వాడాంబరాలు తురిమింది. ఆకాశం రంగు కెట్సు తొడిగింది. రెడ్డి ఇంజి నీరుతో టెన్నిసుకి వెళ్లడానికి రేకెట్టు తీసింది; మా నాన్న వచ్చాడు.

"ఎక్కడికి వెళుతున్నావు?" అనడిగాడు.

"రెడ్డితో టెన్నిసుకి" అన్నాది అక్క. నిజమే చెప్పింది.

"ఇవాళనుంచి రెడ్డితోటి నువ్వెక్కడికీ వెళ్లకు" అని చెప్పి నాన్న వెళ్లిపోయాడు.

అక్క ఏడుపు మొదలుపెట్టింది. తెల్లటి దేవకాంచనం రేకల్లాంటి కళ్లు ఎఱ్ఱ కలువరేకులైపోయాయి. అక్క రెడ్డికి అప్పుడే మనసులో నెమలి సింహాసనం వేసి స్సామ్రాజ్య పట్టాభిషేకం చేసుకుంది. దేనికీ అభ్యంతరం పెట్టని నాన్న ముఖ్యమైన దానికే అడ్డు పెట్టేడు.

ఆ మర్నాటినుంచి రెడ్డి మా యింటికి రావడం మానేశాడు. భోగట్టా చెయ్యగా రెడ్డి తల్లి డాక్టరెమ్మో అతన్ని మా యింటి కెళ్ళొద్దని కొడుకుని నిషేధించిందట. మొత్తానికి అక్కా, రెడ్డి ప్రేమించుకోవడం పెళ్ళాడ్డం ఉభయ కుటుంబాల్లోనూ ఇష్టంలేదు. నాన్న ఎందుకు ఆమోదించనట్టు? రెడ్డికన్నా మంచివరుడు ఎక్కడ దొరుకుతాడు? రెడ్డి తప్పకుండా ఏయువతి అయినా వరించదగ్గవాడు. ఇద్దరు డాక్టర్ల కొడుకు లక్షలు గడించిన తల్లిదండ్రులు. ఇంజనీరు. బాగా సంస్కారం వున్నవాడు. అక్క అదృష్టానికి నాకెంతయినా ఈర్ష్యగానే వుండేది.

వారం రోజులైంది. ఒకనాడు అక్క మాయమైపోయింది. నాన్నకి ఉత్తరం రాసిపెట్టింది.

"నేను సరియైనచోటికి సరియైన స్థితిలో వెళ్ళుతున్నాను. నైతికమైన పొరపాటు చెయ్యటంలేదు. నాకోసం వెలికి నన్ను వీధిన పెట్టకండి. ప్రమాదమైన చోటికి వెళ్ళడంలేదు. సరియైన పార్టీతో వెళుతున్నాను" అని రాసి పెట్టింది.

ఉత్తరం ఒక్కళ్ళకి బోధపడలేదు. కొంపతీసి నగ్జలైటు అయిపోలేదుకదా? అదో అనుమానంవచ్చింది. నగ్జలైట్ల కబుర్లు అక్క కొన్ని అనేది. నాకు నమ్మకంలేదు. సొసైటీ డిన్నర్ పార్టీలకి డాన్సు పార్టీలకి అక్క వెళ్ళగలదు. అంతకన్నా అది వెళ్ళగలిగే పార్టీ నాకు కనబడలేదు.

ఇంకెవడితోటో లేచిపోయి ఉంటుంది. డబ్బుచేత తక్కువవాడు అయి ఉంటాడు. అక్క ఎంతమందినో కుఱ్ఱాళ్ళని వెఱ్ఱెత్తిస్తూ ఉంటుంది. అలాగ వెఱ్ఱెతిస్తూ ఎవడినో చూసి తనూ వెఱ్ఱికిపోయి ఉంటుంది.

ఎంచేతంటే ఇంజినీరు రెడ్డి వూళ్లోనే వున్నాడు. అక్క భోగట్టా ఆతృతతో తనూ అడిగేవాడు. అక్క ఇంకెవడిమీద కన్ను వేసిందో! నాన్న ఆంక్ష పెట్టేక అక్క రెడ్డివూసు ఒక్కసారీ ఎత్తలేదు. రెడ్డిమీద అనుమానం ఎవరికీ కలగలేదు. కాని స్వభావంచేత రెడ్డిని కొన్నాళ్ళు ఒక ఆట ఆడించింది. అంతే!

నాన్న అక్క వూసెత్తలేదు. ఏమీ జరగనట్టు మౌనంగా, నిశ్చింతగా ఊరుకున్నాడు. "ఏ అనుభవమైనా మంచిదే. కానీ దానికే బుద్ధి వస్తుంది" అని ఊరుకున్నాడు. అమ్మ లబోదిబో మొత్తుకుంది. మొత్తుకుంటూనే ఉంది.

రెడ్డికి ఉద్యోగమైంది. షోలాపూర్ వెళ్ళిపోయాడు. మాకూ రెడ్డికి రెండు రోజులదూరం. నాన్నకి దక్షిణాది బదిలీ అయిపోయింది. డాక్టరు దంపతులకి రైలుమీద రెండున్నర రోజుల దూరం అయిపోయాము. నాన్నకి వెళ్ళడం ఇష్టంలేదు. వెళ్ళక తప్పలేదు. ప్రమోషను మీద వచ్చిన ట్రాన్స్ఫరు! అక్క సంగతి తెలియలేదు. ఊరు విడచి వెళుతూ ఉంటే అమ్మ అక్క చచ్చిపోయినట్టు ఏడ్చింది.

ఆ వూరు వెళ్ళడమే నాన్న జ్వరంతో మంచం పట్టేడు. అక్కడ డాక్టర్లమీద నాన్నకి నమ్మకంలేదు. డాక్టరు దంపతులకి టెలిగ్రాము ఇచ్చాము. "డాక్టరెమ్మో ఒక్క మోతాదు ఇస్తే చాలు" అనేవాడు నాన్న. "డాక్టరన్నప్పుడు డాక్టరెమ్మాయే. ఎందుకొచ్చిన డాక్టర్లు" అనేవాడు నాన్న. "రెడ్డికి ఓ టెలిగ్రాం ఇవ్వండి. వాణ్ణి చూడాలని ఉంది" అన్నాడు నాన్న. ఇంజినీరు రెడ్డికి టెలిగ్రాము ఇచ్చాము. అక్కకోసం ఏడవడం మొదలెట్టాడు. రోజుకి వందసార్లు దానిపేరు అనేవాడు. "వెర్రితల్లి ఎక్కడుందో!" అంటూనే వుండేవాడు.

నాన్న జ్వరం ప్రమాదస్థితికి వచ్చింది. బతుకుమీద ఆశ వొదులుకున్నాడు. "నేను బతికుండగా ఎవ్వరూ రారు" అనేవాడు. రాత్రీ, పగలూ నన్ను దగ్గర కూర్చోపెట్టుకునేవాడు. "నీకు చెప్పాలమ్మా చెప్పాలి. చెపుతాలే" అనేవాడు.

"చెపుతానంటావు చెప్పు. చెప్పు నాన్నా" అని ఎన్నిసార్లడిగినా చెపుతానంటూ ఉండడం చెప్పకపోవడం. నే నొక్కర్తినీ ఉండగా నాన్న చెప్పేడు.

"నేను చెపితే నీకే చెప్పాలి. చిన్న పిల్లవి, ఆతురివి. అమ్మకు చెప్పేది కాదు. నీకు చెప్పేది కాదనుకో. ఇంకెవరికి చెప్పడం? నువ్వే ఉన్నావు. విధిలేక చెపుతున్నాను. నేను చాలా స్వేచ్ఛాజీవిని. మీ అమ్మని పెళ్ళి ఆడాకే నాకూ డాక్టరెమ్మాకి సంబంధం ఏర్పడ్డాది. డాక్టరెమ్మా గర్భవతి అయిపోయింది. ఎంత చిక్కు వచ్చిందో చూశావా? డాక్టరు పిళ్ళారెడ్డి నాకు అప్పటికే బాగా స్నేహితుడు. వాడితో చెప్పేను. ఈ అసాధ్యానికి నువ్వే తగినవాడివి అన్నాను. వాడు డాక్టరెమ్మాని పెళ్ళాడతా నన్నాడు. పెళ్ళాడాడు. పురుడు పోశాడు. రెడ్డి పుట్టాడు. మీరు మీ అమ్మకి పుట్టారు రెడ్డి ఎమ్మాకి పుట్టాడు. అక్క వొస్తే చెప్పమ్మా. చెప్పు" అని వలవల ఏడిచాడు.

డాక్టరు దంపతులు వొచ్చారు. డాక్టరెమ్మా మందులిచ్చింది. మంచం దగ్గిర కూర్చుని సేవచేసింది. డాక్టరెమ్మా చేతులలోనే నాన్న ప్రాణాలు విడిచిపెట్టేడు. దౌర్భాగ్యురాలు అక్క ఎక్కడుందో!

నాన్న చచ్చిపోయిన మర్నాడు షోలాపూరు నుంచి రెడ్డి వచ్చాడు. రెడ్డి వెనకాతల అక్క ఉంది. ఇంటిల్లిపాదీ ఏడుపులు మొర్రలూ వాటి మధ్య అక్క వొచ్చిందని సంతోషం. వాళ్ళిద్దరూ రావడం ఆశ్చర్యంగానే వుంది.

"మీ ఇద్దరూ ఎలాగ వచ్చారు?" అని అడిగాడు డాక్టరు రెడ్డిగారు.

"మేం షోలాపూరులో పెళ్ళి చేసుకొన్నాం. ముందది వెళ్ళింది. తరవాత నేను వెళ్లాను" అన్నాడు రెడ్డి.

డాక్టరెమ్మా మొహం కత్తితో కోస్తే రక్తంలేదు. నేను పచ్చగా అయిపోయాను.

"మాతో చెప్పితే వద్దంటామా? కాదంటామా? దౌర్భాగ్యులు ముందు చెప్పితే ఏం? స్నేహితుడు బతికుండగా వైభవంగా పెళ్ళి జరిగుండును" అంటూ పిళ్ళారెడ్డిగారు ఏడ్చారు.

"నేనొద్దన్నా నా మాట విన్నారు కాదు" అని ఏడ్చింది డాక్ట రెమ్మా.

"ఎందుకొద్దన్నావు?"

"వయస్సులు బొత్తిగా దగ్గర. నాకు దాని చెల్లెల్ని కోడల్ని చేసు కుందామని నిశ్చయం చేసుకున్నాను" అన్నాది డాక్టరెమ్మా! నాన్నా, డాక్టరెమ్మల మాట వింటే రెడ్డికి నన్నిచ్చి పెళ్ళి చేసేవారా? పచ్చి అబద్ధం.

"ఊరుకుందూ వాళ్ళకి వాళ్ళు పెద్దలయ్యారు" అన్నారు డాక్టరు రెడ్డిగారు!

"నేనొప్పుకోను ఈ పెళ్ళికి. నా మాట కాదని నాకు తెలియకుండా ఎందుకు చేసుకోవాలి?" అన్నాది డాక్టరెమ్మా. ఇంకేమనేస్తుందో అని భయ పడ్డాను. డాక్టరెమ్మా మొహం వివర్ణమైపోయింది.

"ఇంక ఆర్నెల్లు కళ్ళు మూసుకోండి. మీకు మనమడు పుడతాడు. ఆ తరవాత మా పెళ్ళి వొద్దందురుగాని" అన్నాది అక్క. అక్కకి సిగ్గూ లజ్జా లేదు. రెడ్డి భుజాన్ని పట్టుకుని వేళ్ళాడుతూ "మీరేమంటారు ఇంజి నీరుగారు?" అన్నాది. ఇంజినీరుగారు పకపకా నవ్వేడు.

డాక్టరెమ్మా మరి మాటాడలేదు. గుండెలమీద క్రాసు చేసుకొంది. ప్రార్థన చేసుకుంది. ఊరుకుంది.

"అలాగ్గా నువ్వు ఏసుక్రీస్తుకి తల్లి మేరీకి పశ్చాత్తాపంతో క్షమా పణ చెప్పుకో. నాకు ఫరవాలేదు. నేను నమ్మకాలులేని వాణ్ణికాదా? అన్నారు డాక్టరు రెడ్డిగారు. ఆ తరవాత డాక్టరెమ్మా పల్లెత్తి మాటాడకుండా ఊరు కొంది.

అక్క పురుడు పోసుకుని కవలల్ని కంది. ఇద్దరూ మంచి ఆరో గ్యంగా ఉన్నారు కొడుకులు.